www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025
5
ఏలూరు



సిబ్బంది విధులను అధికారులు పర్యవేక్షించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు : గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి కేటాయించిన విధులను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఒలు, డిపిఒ, ఇఒపిఆర్డిలు, ఐసిడిఎస్ సిడిపిఒలు, సంబంధిత అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన అంశాలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామ/వార్డ్ సచివాలయాల ద్వారా చేపట్టే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన నివేదికలను టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏరోజుకారోజు రిపోర్టును, తనిఖీలు చేసిన ఫొటోలు క్యాప్షన్‌తో సహా నివేదికను అందించాలని జిల్లా పరిషత్ సిఇఒను కలెక్టర్ ఆదేశించారు.

రోగాల పుట్ట.. వైద్యారోగ్య శాఖ..!

ఎంఆర్ఐ, సిటీస్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు
రక్త పరీక్ష కేంద్రాలపైనా కొనసాగుతున్న తీవ్ర నిర్లక్ష్యం
అధికారుల నిర్లక్ష్యంతో బలవుతున్న నిండు ప్రాణాలు
ప్రయివేటు స్కానింగ్, రక్త పరీక్ష కేంద్రాల్లో అధికారుల తనిఖీలు నిల్
భారీగా మామూళ్లు ముట్టడమే దీనికి కారణమా..?
స్కానింగ్ సెంటర్ల సమాచారం ఇచ్చేందుకు అధికారులు ససేమిరా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో లోపాల కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. ఆ శాఖాధికారుల నిర్లక్ష్యం సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. మంగళవారం జిల్లాకేంద్రం ఏలూరులో సుస్మిత డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఓ మహిళ ఎంఆర్ఐ స్కానింగ్ తీస్తుండగా మృతి చెందిన ఘటనే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం వంద వరకూ ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ సెంటర్లు ఉండగా, మరో వంద వరకూ రక్త పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. స్కానింగ్, రక్త పరీక్ష కేంద్రాల్లో ప్రతిరోజూ వేలాది మంది పరీక్షల కోసం వెళుతుంటారు. అంత పెద్దసంఖ్యలో రోగులు వెళ్లే స్కానింగ్, రక్త పరీక్ష కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ అనేది లేకుండాపోయింది. స్కానింగ్, రక్త పరీక్ష కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా నడుస్తున్నాయా.. అక్కడి నిపుణులైన వారిని నియమించారా అనే విషయాలను వైద్యారోగ్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. స్కానింగ్ సెంటర్లు అనుమతి తీసుకున్న వారు నిర్వహిస్తున్నారా అంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. స్కానింగ్, రక్త పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో వైద్యశాఖ అధికారులు కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో పాటించాల్సిన నిబంధనలను సైతం వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రాణాలు పోయిన సందర్భాల్లో మాత్రమే హడావుడి చేసి నివేదికలు సమర్పించడం, తర్వాత మమ అనిపించడం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులకు పరిపాటిగా మారిపోయింది. నిబంధనల ప్రకారం స్కానింగ్ సెంటర్లలో రేడియాలజీకి చెందిన టెక్నీషియన్, రక్తపరీక్ష కేంద్రాల్లో ఎంఎల్‌టికి సంబంధించిన డిప్లమో, బిఎస్‌సి ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు చదివిన వారుండాలి. చాలా స్కానింగ్ సెంటర్లలో కోర్సులు చేయని అనర్హులను నియమించుకుని పని కానిచ్చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేస్‌మేకర్ ఏర్పాటు చేసిన రోగికి స్కానింగ్ తీయడంపై అక్కడి వారికి అవగాహన లేకపోవడం కారణంగానే మహిళ మృతి చెందినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం జిల్లా వైద్య శాఖాధికారులు నిరంతరం స్కానింగ్, రక్తపరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. గతంలోనూ అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లా కలెక్టర్ దృష్టికెళ్లి ఆదేశిస్తే తప్ప జిల్లా వైద్యశాఖాధికారులు ఏ ఒక్క పనినీ సక్రమంగా చేయని పరిస్థితి ఉంది. జిల్లా వైద్యశాఖ అధికారుల పనితీరు అంతా వారి సొంత ఎజెండా ప్రకారం సాగిపోతుందే తప్ప ప్రజా సమస్యలపై ఉండటం లేదనే చర్చ జనాల్లో సాగుతోంది.



స్కానింగ్ సెంటర్ల సమాచారం ఇవ్వకుండా అధికారుల గోప్యత

జిల్లాలో స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు సైతం డిఎంహెచ్ఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది వెనుకాడుతున్నారు. స్కానింగ్ సెంటర్లకు సంబంధించి లోపాలు బయటపడతాయనే ఆందోళన వారిలో కన్పిస్తోంది. స్కానింగ్ సెంటర్లు, రక్తపరీక్ష కేంద్రాలకు అనుమతి తీసుకున్న వ్యక్తులు, నిర్వహిస్తున్న వారు చాలా కేంద్రాల్లో వేరుగా ఉన్నట్లు తెలుస్తోంది. అనుమతి తీసుకున్న సర్టిఫికెట్ ఒకరి పేరున, నిర్వహిస్తున్న వారు వేరొకరు ఉంటున్నట్లు రోగుల్లో చర్చ నడుస్తోంది. సంబంధిత విద్య అభ్యసించిన వారు కాకుండా, అనర్హులను తక్కువ జీతాలకు టెక్నీషియన్ల వద్ద పని చేసిన వారిని నియమించుకుని స్కానింగ్‌లు, పరీక్షలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. అసలు విషయాలు బయటికి వస్తాయన్న కారణంతోనే స్కానింగ్, రక్తపరీక్షా కేంద్రాలకు సంబంధించిన సమాచారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఇవ్వడం లేదని తెలుస్తోంది. సమాచారం ఇవ్వడంలో అక్కడి అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

ఆది నుంచి వైద్యఆరోగ్య శాఖలో అవినీతి కంపు

జిల్లా వైద్యఆరోగ్య శాఖపై ఆది నుంచి అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఆరోగ్యశాఖ సిబ్బంది నియామకంలో సొమ్ము వసూళ్లు, డిప్యూటేషన్లపై సిబ్బంది నియామకంలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు, బిల్లులకు సంబంధించిన అవినీతి ఆరోపణలు.. ఇలా ఎన్నో అవినీతి వ్యవహారాల్లో డిఎంహెచ్ఒ ఆఫీసు కూరుకుపోయింది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు విచారణలు చేయడం, మళ్లీ పక్కన పెట్టేయడం అధికారులకు పరిపాటిగా మారింది. డిఎంహెచ్ఒ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తే తప్ప జిల్లా ప్రజలకు మేలు జరిగే పరిస్థితి కన్పించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు జిల్లా వైద్యఆరోగ్య శాఖ ప్రక్షాళనపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి మరో నామినేషన్

మూడుకు చేరిన నామినేషన్లు
నేడు పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు నామినేషన్ దాఖలు
పాల్గొనున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, ప్రజాసంఘాల నేతలు



నామినేషన్ దాఖలు చేస్తున్న జి.బాలాజి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన గుండుమోలు బాలాజీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్లో పట్టభద్రుల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ఆయన ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అభ్యర్థి గుండుమోలు బాలాజీతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవ్వగా రోజుకు ఒకటి చొప్పున మూడు రోజుల్లో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల పదోతేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. మరో ఐదు రోజులు మాత్రమే నామినేషన్ల గడువు మిగిలి ఉండగా ఇందులో రెండురోజులు సెలవులు ఉన్నాయి. చివరి రోజున ఎక్కువస్థాయిలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కన్పిస్తోంది.

నేడు పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థిగా పిడిఎఫ్ తరపున డి.వి.రాఘవులు గురువారం నామినేషన్ వేయనున్నారు. కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొనే అవకాశం ఉంది. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్, డిఇఒ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్ వేసేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం సైతం పిడిఎఫ్ నాయకులు నిర్వహించనున్నారు. అధికార టిడిపికి చెందిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఈ నెల పదో తేదీన నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.


పెద్దసంఖ్యలో తరలొచ్చిన నిర్వాసితులు

మండలం యూనిట్‌గా పరిహారం ఇవ్వాలి

కుక్కునూరు గ్రామసభలో నిర్వాసితుల డిమాండ్
అధికారులకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా 2022 గోదావరి వరదలను ప్రామాణికం చేసుకుని మండలం యూనిట్‌గా పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతుల స్వీకరణకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఐటిడిఎ పిఒ రాములు నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. దీనికి అన్ని గ్రామాల్లోని నిర్వాసితులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ రాములు నాయక్ మాట్లాడుతూ మండలంలోని 41.15 కాంటూర్‌లోని నిర్వాసితుల సమస్యలపై ఈ గ్రామ సభ ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో అక్కడకొచ్చిన నిర్వాసితులంతా నిరాశకు గురయ్యారు. దీనిపై వెంటనే నిర్వాసితుల సంఘం నాయకులు వై.నాగేంద్రరావు మాట్లాడుతూ 41.15 కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంతోపాటు మండలం మొత్తం యూనిట్‌గా తీసుకొని పరిహారం ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని మండలంలోని 45.75 కాంటూర్‌లోని నిర్వాసితులంతా ఇక్కడకొచ్చారని, దీనికి అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. ప్రతియేటా వచ్చే గోదావరి వరదలకు మండలంలోని నిర్వాసితులంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా నిర్వాసితులను ఇక్కడి నుండి తరలించే తేదీనే కటాఫ్‌గా నిర్ణయించి యువతీ యువకులకు పరిహారం చెల్లించాలని, మిగులు భూములకు పరిహారం ఇవ్వాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్‌బాబు, ఎంపిడిఒ నరసింహారావు, ఇతర సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు కోటగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.


దరఖాస్తులు రాస్తున్న నిర్వాసితుల సంఘం నాయకులు

నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో దరఖాస్తుల కౌంటర్ ఏర్పాటు

మండలంలోని అన్ని గ్రామాల నుండి నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒకేసారి వేలాదిగా తరలి రావడంతో మండల కేంద్ర ంలోని జిరాక్స్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరారు. దరఖాస్తులను ఎలా రాయాలో ఇబ్బంది పడుతున్న వారికి సహకరించేందుకు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో గ్రామసభ జరుగుతున్న ఆవరణలో దరఖాస్తుల కౌంటర్ ఏర్పాటు చేసి నిర్వాసితులకు దరఖాస్తులను రాసి గ్రామసభ అధికారికి ఇప్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు బయ్యన శ్రీను, వై.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యాన ధర్నా

కుక్కునూరు: మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్వాసితులందరికి ఒకేసారి ఆర్అండ్ఆర్ ఇవ్వాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ధర్నాకు జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చంద్రరావు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడగా నేతలు కంగాల కల్లయ్య, మున్నీ, మచ్చా లక్ష్మయ్య, మడివి వూసయ్య, మచ్చ ప్రశాంత్, లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే..

కార్మిక చట్టాలు అమలు చేయాలి
సిఐటియు ఆధ్వర్యాన నిరసనల వెల్లువ



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కె.బుచ్చిబాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం నుంచే పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కరోనా సమయంలో మోడీ ప్రభుత్వం మార్చేసి వాటి స్థానంలో కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటితో కార్మికుల హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కార్మికుల చివరి ఆయుధం సమ్మె హక్కు నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ పేరుతో మోడీ ప్రభుత్వం కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చి, వారి శ్రమను కొల్లగొట్టేందుకే ఈ లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. తక్షణమే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేకుంటే అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేసి పోరు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వివిఎన్.ప్రసాద్, కనకారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జి.రవికిషోర్, జై.గోపి, లోకేశ్వరి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా నాయకులు తొర్లపాటి బాబు, బండి వెంకటేశ్వరరావు, భజంత్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. స్థానికంగా చేపట్టి నిరసనుద్దేశించి ఎస్.శివకుమార్, కె.సీతారాముడు, సిహెచ్.మరిడియ్య, పి.తమ్మారావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు గుడెల్లి వెంకటరావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు మడకం సుధారాణి, అనుమోలు మురళి, వడకం కుమారి, సోయం భవాని, కుంజా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సాయికిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు నేతలు తిరోజుల సురేష్, సరియం హరినాథ్, అన్నపూర్ణ, మాధవి, రమణ, దుర్గ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో...

చింతలపూడి: లేబర్ కోడ్‌లకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ప్రమద్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు మాట్లాడారు. ధర్నాకు సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జె.పుష్పరాణి, బి.సరళ, పి.వరలక్ష్మి, ఆర్.పద్మ, బి.చంద్రకుమారి, ఎన్.సరోజిని, టి.మాణిక్యం, సరళ, హేమలత, చెన్నకేస్వరి, సీతామహాలక్ష్మి, నాగరాజు, వల్లి, వంశీ, ధర్మారావు పాల్గొన్నారు.

కాకులను కొట్టి గెద్దలకు పెట్టేలా కేంద్ర బడ్జెట్

సిఐటియు, వ్యకాస, రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గెద్దలకు పెట్టిన చందంగా కార్మికులు, రైతాంగంపై భారాలు వేసి కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టే బడ్జెట్‌గా ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరులోని వసంత మహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం చేశారు.


జీలుగుమిల్లిలో...

కార్మిక, రైతాంగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసించండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు, ఎ.రవి, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు మాట్లాడారు. దేశంలో నూటికి 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం, రూ.1,71,437 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎరువుల రాయితీలో రూ.3,412 కోట్లు కోత విధించారని విమర్శించారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల గురించి ప్రస్తావనే లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు, కనీస మద్దతు ధరలకు సంబంధించి బడ్జెట్‌లో జాడే లేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి, విద్య, వైద్య రంగాలకు భారీగా నిధులు కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,396 కోట్లు కేటాయించారని, నిర్వాసితుల పరిహారం, పునరావాసం గురించి ప్రస్తావనే లేదని మండిపడ్డారు. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలను అనుమతించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బి.సోమయ్య, వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు, జె.గోపీ, గొట్టాపు రవి కిషోర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదల సొమ్మును కార్పొరేట్లకు దోచిపెట్టేలా ఉందని రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య విమర్శించారు. జీలుగుమిల్లి జాతీయ రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపి ప్రతులను దహనం చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎపికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందని విమర్శించారు. ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు దాసరి జానకి రామిరెడ్డి, నాయకులు కొండలరావు, శేషగిరిరావు, రామారావు, గాంధీ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ఏలూరులో...

చింతలపూడి : ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చింతలపూడిలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, రైతు సంఘం నాయకులు జంగా రామచంద్రారెడ్డి, తక్కలపాడు ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, ఎం.సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎసిబి వలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆమె సహాయకుడు

రూ.1,09,000 స్వాధీనం
వారి ఇళ్లల్లోనూ సోదాలు
ఎసిబి డిఎస్‌పి సుబ్బరాజు



ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నాణ్యతలేని సోడాలు తయారు చేస్తున్న ఊప్స్ గోలి సోడా కంపెనీ యజమాని నుంచి లంచం డిమాండ్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను, ఆమె సహాయకుడిని ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు వల వేసి పట్టుకుని అరెస్టు చేశారు. ఏలూరు అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ ప్రాంతంలో ఊప్స్ అనే పేరుతో కాట్లంపూడి గ్రామానికి చెందిన సాయి గోకుల్ గోలి సోడా కంపెనీ నిర్వహిస్తున్నాడు. అయితే సాయిగోకుల్‌కు ఏలూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దొండపూడి కావ్యరెడ్డి, ఆమె సహాయకుడు పుల్లారావులు ఫోన్ చేసి గోలి సోడా రసాయనాలు అధికంగా ఉన్నట్లు గుర్తించామని సమాచారం అందించారు. ఇందుకు రూ.25 వేలు లంచంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేయగా అధికారికి రూ.20 వేలు, సహాయకుడికి రూ.రెండు వేలుగా ఒప్పందం చేసుకున్నారు. మంగళవారం ఆ నగదును ఇచ్చేందుకు ప్రణాళిక వేసుకున్నారు. కాని అధికారి ఆమె సహాయకుడు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆ లంచం సొమ్మును కావ్యరెడ్డికి, పుల్లారావుకు గోకుల్ అందించాడు. అప్పటికే అక్కడ ఉన్న అవినీతి నిరోధక శాఖాధికారులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారు వినియోగిస్తున్న కారును కూడా తనిఖీ చేయగా రూ.87 వేలు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.22 వేలు, కారులో రూ.87 వేలు మొత్తం రూ.1,09,000 స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా వారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహిస్తున్నామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ దాడిలో ఏలూరు అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి వి.సుబ్బరాజు, సిఐలు ఎన్.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, రాజమండ్రి అవినీతి నిరోధక శాఖ వాసు కృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు దర్శనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఈ నెల మూడో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. అయినప్పటికీ ఏలూరు నగరంలో స్థానిక రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించలేదు. ఏలూరు నగరంలో ఫైర్ స్టేషన్ నుంచి పవర్ పేట స్టేషన్ వైపు వెళ్లే మార్గంలో లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలను ఇప్పటికీ అధికారులు తొలగించకపోవడంతో అనేక విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఫ్లెక్సీలను తొలగించి ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన అవసరం ఉంది.



స్తంభాలకు రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

పాతముప్పర్రులో దారుణం

స్కూల్ బస్సు చక్రాల కింద పడి రెండేళ్ల బాలుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అప్పటివరకు తల్లి, అన్నతో కలిసి ఆడుకున్నాడు. కేరింతలు కొట్టాడు. అన్నను స్కూల్ బస్సు ఎక్కించేందుకు వచ్చిన తల్లితో కలిసి బయటకు వచ్చాడు. ఇంతలో మృత్యువు బస్సు రూపంలో వచ్చి ఆ చిన్నారిని బలితీసింది. రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు బస్సు కిందపడి మృతి చెందిన ఘటన పెదపాడు మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామానికి చెందిన అప్పటివలస ఏసుపాదం, మనిషికుల ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు జోష్ ఏలూరు నగరంలోని గుడ్‌న్యూస్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ గుడ్‌న్యూస్ పాఠశాలకు చెందిన పాఠశాల బస్సులో స్కూల్‌కు వెళ్లి వస్తూ ఉంటాడు. యథావిధిగా బుధవారం కూడా బాలుడిని పాఠశాలకు తీసుకెళ్లేందుకు పాఠశాల బస్సు వచ్చింది. అదే సమయంలో జోష్‌తో పాటు అతని సోదరుడు శ్రీదీక్షిత్ (2) తల్లితో కలిసి బస్సు వద్దకు వచ్చాడు. శ్రీదీక్షిత్ బస్సు వెనుక చక్రాల కిందకు వెళ్లాడు. డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు కదిలింది. దీంతో వెనుక చక్రాల కింద పడిన శ్రీదీక్షిత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలుడిని హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

మానవత విరాళాలే స్వచ్ఛంద సేవలకు స్ఫూర్తి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎందరో మహానుభావుల మానవతా విరాళాలే స్వచ్ఛంద సేవలకు స్ఫూర్తి అని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్, ప్రస్తుత పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ సివి.రావు అన్నారు. తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లోని కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు విశ్రాంత ఇంజినీర్ కాకర్ల శంకరరావు, అనంతపురం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల బృందం ఆర్చిదావా, ఆరాధ్య యలమంచిలి(అమెరికా), యలమంచిలి సుభాష్ చంద్రబోస్‌లు అందించిన విరాళాలతో తొమ్మిది మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐజి.దామోదర నాయుడు, హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, కార్యదర్శి టి.లక్ష్మి, క్యాంపస్ ఛైర్మన్ పి.ధనప్రకాష్, మర్చంట్ నేవీ చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.కృష్ణారావు(అమెరికా), కోనేరు ఉష, సంఘ సేవకులు మొవ్వ శారద, వై.విజయలక్ష్మి, ఎం.మాధవిలత పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిత్తపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.విజయలక్ష్మి తెలిపారు. 117 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విడివిడిగా ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌమార దశలో వచ్చే శారీరక మార్పులు, సందేహాల గురించి వ్యక్తిగత పరిశుభ్రత గురించి, బాల్య వివాహాల వల్ల వచ్చే ప్రమాదాల గురించి, రక్తహీనతను అధిగమించడానికి ఐరన్ ఫోలిక్ మాత్రల ఆవశ్యకత గురించి తదితర ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ జివి.రమణ, ఎంఎల్‌హెచ్ పి వీరాస్వామి, ఎఎన్ఎం బి.సామ్రాజ్యం, ప్రధానోపాధ్యాయులు ఇఎస్.రంగారావు, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు సంఘం ఎన్నిక బుధవారం ముదినేపల్లిలో నిర్వహించారు. ఈ ఎన్నికలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా సుంకర హారిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మల్లెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా షేక్ యాకూషా వల్లి, కార్యదర్శిగా పరసా సురేష్, ట్రెజరర్‌గా జుజ్జవరపు గిరిజ, సంయుక్త కార్యదర్శిగా సంబంగి సుబ్రహ్మణ్యం, ప్రచార కార్యదర్శిగా లోకం శివ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గ సభ్యులను పంచాయతీ కార్యదర్శులు జి.రమేష్, వై.శ్యాంసుందర్, పి.మనోజ్‌కుమార్ తదితరులు అభినందించి శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు.



మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ములగలంపల్లిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రావులపల్లి శాంతిరాజు (42)కు బుధవారం అతని ఇంటి వద్ద కరెంట్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మిట్టగూడెం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని గుర్తించినట్లు పిడిఎస్ డిటి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో 3.5 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని మాదరాజు కృష్ణశివదీప్, పెద్దిరెడ్ల రామచంద్రరావు, చప్పిడి వెంకటకృష్ణలపై 6(ఎ), 7(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. పేద కుటుంబాలకు చేరాల్సిన పిడిఎస్ బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని హెచ్చరించారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టి.నరసాపురం పంచాయతీలోని చిన్నగురువాయిగూడెం గ్రామానికి చెందిన ఎలమర్తి వెంకటేశ్వరరావు చెల్లెలు వాణి గత 15 ఏళ్లుగా హైదరాబాదులో తన భర్తతో కలిసి నివాసం ఉంటుంది. సాని కొమ్మునారాయణరెడ్డి అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయాల్లో మోసం చేసిందని అది తట్టుకోలేని నారాయణరెడ్డి తండ్రి కొన్నిరోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో వాణితో పాటు ఆమె ఇద్దరు అన్నలు ఆమె కుమారుడిపై కేసు నమోదైంది. అయితే అతన్ని మోసం చేసిన విషయంలో వాణి సోదరుడు వెంకటేశ్వరరావు పాత్ర ఉందని అనుమానించిన నారాయణరెడ్డి అతనిని చంపేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. బుధవారం ఉదయం చిన్న గురవాయిగూడెం చేరుకొని ఇంటి నుంచి బయటకు వచ్చిన వెంకటేశ్వరరావుపై కారం చల్లి, పెట్రోల్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించాడు. అతను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో నారాయణరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో వీరంకి సారికను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. కేసు నమోదు చేసి మహిళను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

పోలవరం : పోలవరం మండలంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 30 లీటర్ల నాటుసారాతో వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వింజరం గ్రామ పంచాయతీలో బస్టాండ్ వద్ద జరిపిన వాహనాల తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల నాటుసారా తరలిస్తున్న మడకం దేవరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

రామతులసి మృతిపై విచారణ

నివేదిక కలెక్టర్‌కు అందిస్తాం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకునేందుకు డయాగ్నస్టిక్ సెంటర్‌కు వచ్చిన మహిళ మృతిపై విచారణ చేశామని డిఎంహెచ్‌ఒ మాలిని తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు. బుధవారం ఉదయం ఆయుష్ ఆసుపత్రికి వెళ్లి విచారణ చేసినట్లు తెలిపారు. రామతులసి గత కొన్నేళ్ల నుంచి ఆయుష్ హాస్పిటల్‌లో 21 సార్లు డయాలసిస్ చేయించుకున్నారని తెలిపారు. తల తిరుగుతుందని చెప్పడంతో నీరు చేరిందేమో అనే ఉద్దేశంతో స్కానింగ్ రాసినట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. పేస్ మేకర్ ఉండగా స్కానింగ్ ఎలా రాశారని వైద్యులను అడగగా ఆమెకు ప్రో పేస్ మేకర్ ఏర్పాటు చేశామని, దాని వల్ల స్కానింగ్‌కు ఎటువంటి ఇబ్బంది ఉండదని కార్డియాలజిస్ట్ సలహాతో స్కానింగ్ రాసినట్లు ఆయుష్ హాస్పిటల్ వైద్యులు తెలిపారని వివరించారు. అనంతరం సుస్మిత డయాగ్నస్టిక్స్‌కు విచారణకు వెళ్లామని తెలిపారు. ఆక్కడ విచారణ చేయగా ఎంఆర్ఐ స్కానింగ్ తీసేటప్పుడు భర్త కోటేశ్వరరావును కాళ్లు పట్టుకునేందుకు లోపలికి పిలిచామని, అయితే స్కానింగ్ తీసే సమయంలో రామతులసి కాళ్లు, చేతులు కొట్టుకోవడంతో భర్త కంగారు పడి, సిబ్బందిని భర్త కోటేశ్వరరావు సిపిఆర్ చేయనివ్వలేదని సిబ్బంది తెలిపారని వివరించారు. విచారణ చేసిన తుది రిపోర్టు కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

డిఎల్‌పిఒ సుందరికి సత్కారం

ప్రజాశక్తి - ముసునూరు

డిఎల్‌పిఒ ఎంఎన్.సుందరిని ముసునూరు మండల అధికారులు బుధవారం సత్కరించారు. పంచాయతీరాజ్ పనులు నిమిత్తం డిఎల్‌పిఒ బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. గత నెల 26వ తేదీన రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఆమె ఉత్తమ డిఎల్‌పిఒ అవార్డు కలెక్టర్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నాయుడు, పామర్తి వీర్రాజు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - పెదవేగి

జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవాలని, మామిడి పంటకు ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలంలోని పెదవేగి, గార్లమడుగు తదితర గ్రామాల్లో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. మామిడి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కె.శ్రీనివాస్ జిల్లాలో 35 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయని చెప్పారు. గత మూడేళ్ల కాలంగా మామిడికి గులాబీ రంగు పురుగు, తామర పురుగు, ముడి పుచ్చు, వ్యాధులు సోకి పూత నల్లగా మాడిపోయి దిగుబడులు లేక మామిడి రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించిందని నేటికీ అమలయ్యే పరిస్థితి లేదన్నారు. మామిడి రైతులకు ఉచిత బోర్లు పథకం అమలు చేయాలన్నారు. కనీస ధరలు అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

నగరపాలక సంస్థ పిఒగా మహాలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా (పిఒ) బి.మహాలక్ష్మిని నియమిస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎంవిఎస్‌కె.కృష్ణమూర్తిని టౌన్ ప్లానింగ్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా బదిలీ చేశారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన కేన్సర్ బాధితురాలు గుడిదల సత్యవతికి రావెల ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన రూ.పది వేలు ఆర్థికసాయాన్ని టిడిపి స్థానిక నాయకులు బుధవారం అందించినట్లు ఆ పార్టీ నాయకులు చిలకా సుబ్బు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ బాధితురాలు గుడిదల సత్యవతి ఆర్థికంగా ఇబ్బంది పడడం తెలుసుకుని రావెల ఫౌండేషన్ ఛైర్మన్ ఉదయ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మానవత్వంతో స్పందించి రూ.పది వేలు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలకా బాలయ్య, చిలకా రామారావు, చిలకా వెంకటేశ్వరావు, గుడిదల యేసు, లంకా రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

శ్రీ శోభనాచల వ్యాఘ్య్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల మాఘ మాస రథసప్తమి, శాంతి కళ్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం ఆగిరిపల్లి పురవీధుల్లో ఘనంగా జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎం.గోపాలకృష్ణ, ఎం.శివరామకృష్ణ, సత్యకుమార్, రాజు, ఖాదర్‌భాషా, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్‌కు సేవా రత్న అవార్డు

టి.నరసాపురం : మండలంలోని బండివారిగూడెం గ్రామానికి చెందిన అప్పలరాజుగూడెం వనసంరక్షణ సమితి సభ్యులు షేక్ జాకీర్ హుస్సేన్‌కు సేవారత్న అవార్డు లభించింది. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికి ఫలితంగా అవార్డు లభించిందని జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని బండివారిగూడెం గ్రామంలో ఆయన నివాసం వద్ద బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల రెండో తేదీన రాజమహేంద్రవరంలోని సితార గ్రాండ్‌లో మేడిది సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో సేవారత్న అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. గత 30 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన సంరక్షణ సమితిలో సభ్యునిగా ఉంటూ సుమారు 75 హెక్టార్లలో వెదురు, జామాయిల్ మొక్కలు నాటి అటు పర్యావరణ పరిరక్షణతో పాటు కొన్ని కుటుంబాలకు జీవనోపాధి పొందడానికి తన వంతు కృషి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ వనసంరక్షణ సమితిగా అవార్డు రావడానికి కృషి చేసినట్లు ఆయన తెలిపారు. బండివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు వాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషితో పాటు పాఠశాలల్లో జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివ రాయల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

చిన్నారిని కొట్టిన ఉపాధ్యాయుడిపై కేసు

చర్యలు తీసుకోవాలని బంధువుల, ప్రజాసంఘాల డిమాండ్

ఘటనపై తహశీల్దార్ ఆరా

ప్రజాశక్తి - ముసునూరు


మండలంలోకి చెక్కపల్లి గ్రామంలో చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారిని విచక్షణ రహితంగా కొట్టిన ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహశీల్దార్ కె.రాజ్‌కుమార్ బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాఠశాలకు ఘటనపై ఆరా తీశారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన డోల మురళి, మాధురిల చిన్న కుమార్తె వైష్ణవి చెక్కపల్లి చైతన్య పాఠశాలలో ఎల్‌కెజీ చదువుతుంది. వైష్ణవి వలసపల్లిలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చైతన్య పాఠశాలలో చదువుకుంటుంది. ఈ క్రమంలో మంగళవారం పాఠశాలకు వెళ్లిన వైష్ణవిని అల్లరి చేస్తుందని ఉపాధ్యాయుడు సురేష్ కొట్టాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారి ఏడుస్తూ అమ్మమ్మకు విషయం చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పెద్దలు బుధవారం రాత్రి పాఠశాల వద్దకు వెళ్లి చిన్నారిని ఎందుకు కొట్టారని యాజమాన్యాన్ని నిలదీశారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, చర్యలు తీసుకోవాలని బుధవారం ఉదయం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కె.రాజ్‌కుమార్ బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు.

చైతన్య విద్యాసంస్థలో చదువుతున్న ఎల్‌కెజీ విద్యార్థి వైష్ణవిని దారుణంగా కొట్టిన ఉపాధ్యాయుడిపై, విద్యాసంస్థ యాజమాన్యంపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం వ్యాపార దృక్పథంతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చిన్నారిని కొట్టిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.

వైస్ ఛైర్మన్‌కు టైలర్, వర్కర్స్ అసోసియేషన్ అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా ఎన్నికైన పగడాల సత్యనారాయణను నూజివీడు టైలర్, వర్కర్ అసోసియేషన్ అభినందించింది. సత్యనారాయణను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి, చేతి వృత్తిదారుల పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మంత్రి కొలుసు పార్థసారధి సారథ్యంలో అభివృద్ధి చేస్తామని పగడాల సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, సెక్రటరీ షేక్ షబ్బీర్, గౌరవ అధ్యక్షులు దాసి రెడ్డి అనిల్, జగన్, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ఆలీషా, గాల్షిద్, సుబ్బారావు పాల్గొన్నారు.



సత్యనారాయణను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్స్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు అద్భుత అవకాశాలను సొంతం చేసుకున్నారు. ఇన్ఫోసిస్ సంస్థలో పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ద్వారా నిర్వహించబడినది. ఈ 22 మంది విద్యార్థినులు కావటం విశేషం. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, డైరెక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన విద్యార్థులందరికి అభినందనలు తెలిపారు. విద్యార్థులను కంపెనీల అవసరాలకు తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎఒ డాక్టర్ లక్ష్మణరావు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. డీన్ అకాడమిక్ డాక్టర్ చిరంజీవి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమలో సిడిపిసి ఇన్‌ఛార్జి డాక్టర్ చింతయ్య నాయుడు, అసోసియేట్ ప్లేస్‌మెంట్, ట్రైనింగ్ ఇన్‌ఛార్జి దివ్య, కిరణ్, పిఆర్‌ఒ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

దోసపాడు దళితుల సమస్యను పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

దెందులూరు : పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా మండల రెవెన్యూ శాఖాధికారులు వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ, దోసపాడు భూ పోరాట కమిటీ ఆరోపించింది. దోసపాడు భూ పోరాట కమిటీ సమావేశం పి.ఆనందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితులు, పేదలు కొంతకాలంగా వారి అసైన్‌మెంట్, సీలింగ్ భూములు కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల రెవెన్యూ శాఖాధికారులు తప్పుడు నోటీసులు ఇస్తూ పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ సిసిఎల్ఎ కోర్టుకు రావాలని బలవంతం చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల నాలుగో తేదీ సిసిఎల్ఎ కోర్టు ఉందని మీ గ్రామం నుంచి భూముల కోసం పోరాడుతున్నవారందరూ రావాలని పేదలందరికీ నోటీసులు ఇస్తే పేదలందరూ సిసిఎల్ఎ కోర్టుకు వెళ్లగా ఇదే మాకు సంబంధించింది కాదని సిసిఎల్ఎ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కలెక్టర్ ఈ సమస్యలో జోక్యం చేసుకొని, స్థానిక ఎంఎల్ఎ ఈ వ్యవహారంలో అసలైన బాధితుల పక్షాన నిలబడాలని కోరారు. లేకపోతే పేదల భూముల కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందన్నారు. ఇలాంటి తప్పుడు నోటీసులు ఇచ్చి పేదలను భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో భూ పోరాట నాయకులు జాన్‌రాజు, లాజర్ మణి, ఏసుమణి, లక్ష్మి పాల్గొన్నారు.

వెంటనే విధుల్లోకి తీసుకోండి

క్లాప్ ఆటోడ్రైవర్ల ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఏలూరు నగరంలో ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా క్లాప్ ఆటోలను నిలిపివేయడం, వాటిపై పనిచేస్తున్న డ్రైవర్లను ఉద్యోగాలనుంచి తొలగించడానికి నిరసనగా క్లాప్ ఆటోల డ్రైవర్లు గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. బుధవారం క్లాప్ ఆటోల డ్రైవర్లు స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి క్రలవంతెన, వసంత మహల్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ప్రదర్శన, కార్యక్రమాన్ని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వైఎస్.కనకారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే వారిని వీధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ గత మూడున్నరేళ్లుగా నగర ప్రజానీకానికి పారిశుధ్యం విషయంలో ఎన్నో మెరుగైన సేవలందించారని, అలాంటి సేవలందించిన డ్రైవర్లను అధికారులు అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అధికారుల చర్యల వల్ల 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లు తమ జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. గతేడాది డిసెంబరు, జనవరి నెలలో క్లాప్ ఆటోల ఆందోళనకు నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన నాయకులు మద్దతు తెలియజేసి, నేడు అధికారంలోకొచ్చిన తర్వాత వారిని ఉద్యోగాల నుంచి తీసేయడం అన్యాయమన్నారు. వెంటనే తొలగించిన క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి క్లాప్ ఆటోల డ్రైవర్ల యూనియన్ నాయకులు జి.రాజు,గణేష్, హరీష్, సుగుణరావు, శ్రీను, పుష్పరాజ్, తదితరులు నాయకత్వం వహించారు.

1/70పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలి

సిసిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకష్ణ

ప్రజాశక్తి - పోలవరం

1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని గిరిజనులకు స్పష్టం చేయాలని సిసిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని ఇటుకలకోట గ్రామంలో సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం మడివి చలపతిరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా గిరిజనుల చట్టాలను నీరుగార్చే పద్ధతులను మానుకోవాలన్నారు. జనవరి 27న విశాఖపట్నంలో జరిగిన జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఏజెన్సీలో అభివద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని ప్రకటించడం బాధాకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ని సవరిస్తే మరింత వెనకబడిపో తారన్నారు. తక్షణం ఇలాంటి ఆలోచనలను విరమిం చుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అన్న ప్రసాదం వితరణలో సంఘం సభ్యులు

యాత్రికులకు అన్న ప్రసాదం వితరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

శ్రీ శోభనాచల వ్యాఘ్య్ర లక్ష్మీ నరసింహ స్వామి వార్ల మాఘ మాస రథసప్తమి, శాంతి కళ్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన యాత్రికులకు వడ్లమాను నగర సంఘం ఆధ్వర్యంలో ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్లమాను ఎంపిటిసి, న్యాయవాది రానిమేకల సత్యనారాయణ, నగర సంఘ నాయకులు కుప్పాల నాగరాజు, రానిమేకల వడ్డీలు, రెడ్డి వెంకటేశ్వరరావు, తాడిశెట్టి శోభన్‌బాబు, జలసూత్రం రాంబాబు, రానిమేకల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

విత్తన శుద్ధి చేసుకొని తెగుళ్లను తట్టుకునే రకాలను సాగు చేసుకుంటే మినుము పైరులో అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులురాలు జి.వెంకటమణి స్పష్టం చేశారు. మండలంలోని కొర్లపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మినుము పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పైరుకు పల్లాకు తెగులు ఆశించిందన్నారు. ఈ తెగులు తెల్ల దోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. పల్లాకు తెగులు సోకకుండా ఉండాలంటే ముందుగానే విత్తన శుద్ధి చేసుకోవడంతో పాటు తెగుళ్లను తట్టుకునే రకాలను సాగు చేయాలని, పొలం గట్లను శుభ్రం చేసుకోవాలని, తెగులు సోకిన మొక్కలను పీకి వేసి కాల్చివేయాలని చెప్పారు.